ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

బుధవారం 11 జూన్ 2025



అంగన్‌వాడీల బలోపేతంపై నజర్

- ఈనెల 17 వరకు 'అమ్మ మాట -అంగన్‌వాడీ బాట'
- జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ
- చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించడమే లక్ష్యం



జగిత్యాలలోని గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

జగిత్యాల, మే 10 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఏడాది నుంచి వినూత్న కార్యక్రమాలు చేపడుతోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశాలు పెంచే కార్యక్రమంలో భాగంగానే గత ఏడాది నుంచి అమ్మమాట-అంగన్‌వాడీ బాటపేరిట విద్యాసంవత్సరం ఆరంభంలోనే పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈనెల 10నుంచి 17వరకు జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాల నిర్వహణకు జిల్లా మహిళాశిశు సంక్షేమశాఖ ఏర్పాట్లు చేసింది. మూడేళ్ల చిన్నారులు తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరేలా ఐదేళ్లు దాటిన వారిని దగ్గరలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. జగిత్యాల,మెట్‌పల్లి, ధర్మపురి మల్యాల ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అన్ని గ్రామాల్లో అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్ర మాలను నిర్వహిస్తున్నారు.

● సమస్యలతో సతమతం..

జిల్లాలోని జగిత్యాల, మల్యాల, ధర్మపురి, మెట్ పల్లిలో ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. వీటి పరిధిలో 1,065 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. జగిత్యాల ప్రాజెక్టుపరిధిలో 304, ధర్మపురిలో 222, మల్యాలలో 227, మెట్‌పల్లి ప్రాజెక్టు పరిధిలో 312 కేంద్రా లున్నాయి. వీటిలో 272 కేంద్రాలు సొంత భవనాలల్లో నిర్వహిస్తున్నారు. 537 కేంద్రాలను అద్దె భవనాల్లో, 256కేంద్రాలను ఉచిత భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రస్తుతం 1,006 మంది టీచర్లు, 783 మంది ఆయాలు పని చేస్తున్నారు. 59టీచర్, 357మంది ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సూపర్‌వైజర్ పోస్టులు 42మందికి గాను 39 మంది పనిచేస్తున్నారు. మూడు సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను పక్కనే ఉండే మరో కేంద్రానికి చెందిన టీచర్లు, ఆయాలతో నిర్వహిస్తున్నారు. దీంతో రెండు కేంద్రాల పర్యవేక్షణ..

- మిగతా 8లో

● పౌష్టికాహారం, విద్య..

జిల్లాలో 1,065 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఏడు నెలల నుంచి మూడేళ్ల వయస్సు గల పిల్లలు 35,487మంది ఉన్నా రు. 3 సంవత్సరాల నుంచి 5సంవత్సరాలలోపు చిన్నారులు 14,306 మంది ఉన్నారు. వీరిలో5 సంవత్సరాలు నిండిన చిన్నారులు సుమారు 6,030 మంది ఉన్నారు. మూడేళ్లు దాటిన పిల్లలు ఎక్కడెక్కడ ఉన్నారో తెలుసుకుని వారిని అంగన్‌వాడీ కేంద్రాల కు తీసుకొచ్చేందుకు ఈ కార్య క్రమం చేపట్టారు. కేంద్రానికి వచ్చే చిన్నారఉద యం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కేంద్రాల్లోనే ఉండి పూర్వ ప్రాథమిక విద్య అభ్యసిస్తు న్నారు. ఆటపాటలు, కథలతో పాటు సంభాషణ నైపుణ్యాలు నేర్పించి చిన్ననాటి నుంచే మంచి అలవాట్లు అలవర్చుకునేలా సంసిద్ధం చేస్తున్నారు. ఐదేళ్ల వరకు పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తూ ఆ తర్వాత నేరుగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పేలా కార్యక్ర మాలు చేపడుతారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకు నేలా అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికీ వెళ్లి వివరిస్తారు. రెండున్నరేళ్లు పూర్తయిన చిన్నా రులను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారుఎలకు భోజనం, గుడ్డు, మురు కులు అందజేస్తున్నారు.



విద్యార్థుల బస్‌పాస్ చార్జీల పెంపు దారుణం

-ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాకేష్



డిప్యూటీ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల బస్‌పాస్ చార్జీలను 20శాతం పెంచడం అన్యాయమని అఖిల భారత విద్యార్థి సమైఖ్య(ఏఐఎస్ఎఫ్) జిల్లా ఉపాధ్యక్షుడు మందా రాకేష్ అన్నారు. పెంచిన చార్జీలను తగ్గించాలని జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిప్యూటీ మేనేజర్ జగదీశ్వరీని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒకవైపు స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్ మెంట్ రాక మూడేళ్లుగా విద్యార్థులు, పోషకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగ్ నిధులు విడుదల చేయకుండా బస్సు పాస్ చార్జీలను పెంచడంతో పేద విద్యార్థులపై మరింత భారం పడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు మహేష్, సులేమాన్, నెహాల్, ఫర్హాన్ తదితరులున్నారు.

పట్టణ పరిశుభ్రత అందరి బాధ్యత

-ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



జగిత్యాల పట్టణంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణం పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం జగిత్యాల పట్టణంలోని 40వ వార్డులో రెండు కోట్ల రూపాయలతో చేపట్టే అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని కాలనీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం కేవలం మున్సిపల్ కార్మికుల బాధ్యతనే కాదని, అది మన అందరి బాధ్యతగా భావించాలని, అప్పుడే పట్టణంలో పరిశుభ్రత నెలకొంటుందని అన్నారు. 40వ వార్డులో రెండు కోట్ల రూపాయలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడం జరిగిందని 60 లక్షల పనులు జరుగుతున్నాయని అన్నారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం చేపట్టామన్నారు. పట్టణంలో లే అవుట్ ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని జగిత్యాల అభివృద్ధికి 70 కోట్లు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే తెలిపారు. డబుల్ బెడ్ రూం ఇండ్లలో మౌళిక వసతుల కల్పనకు 34 కోట్లు విద్యా, వైద్యం తదితర సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ స్పందన, మాజీ ఛైర్మన్‌లు అడువాల జ్యోతి, గిరి నాగభూషణం, గోలి శ్రీనివాస్, బద్దం జగన్ మోహన్ రెడ్డి, శివ కేసరి బాబు, ఓరుగంటి నాగేష్, కొత్త ప్రతాప్ డిఈ నాగేశ్వర్, ఏఈ శరణ్ తదితరులు పాల్గొన్నారు.

13న జాబ్ మేళా

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించుటకు ఈ నెల 13న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి సత్తెమ్మ తెలిపారు. వివిసీ మోటార్స్ హైదరాబాద్ సంస్థలో హెవీ ఎలక్ట్రికల్ వాహనాలకు సంబంధించిన టెక్నీషియన్ ట్రైనింగ్ ఇప్పించి, సంబంధిత కంపెనీలలో ఉద్యోగం ఇప్పించేందుకు ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ట్రైనింగ్ సమయంలో భోజనంతో పాటు ఉచిత వసతి కల్పించబడుతుందని, ట్రైనింగ్ పూర్తిచేసుకున్న వారికి మహీంద్రా కంపెనీలో ఉద్యోగం ఇస్తారన్నారు. ఆటోమోటివ్ స్పేర్స్ పికర్స్ (15), టెలీ కాలర్స్(15), అక్సెసరీస్ ఎగ్జిక్యూటివ్స్(15) పోస్టులకు ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. అర్హత, ఆసక్తి గలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు ఈనెల 13న ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జరిగే జాబ్‌మేళాకు రెస్యూమ్‌తో పాటు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. ఈ ఇంటర్వ్యూలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని రెండవ అంతస్తులో గల రూం.218 జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో నిర్వహిస్తారని జిల్లా ఉపాధి కల్పనా అధికారి పేర్కొన్నారు.

కూరగాయల సాగుపై అవగాహన

కొడిమ్యాల, జూన్10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడూర్ రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్‌లో శాస్త్రవేత్తలు కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత వానాకాలంలో పశుపోషణ, వానా కాలంలో పశువులకు వచ్చే రోగాలపై అవగాహన , కలిపించారు. పలువురు రైతులు టమాటా పంటలో వచ్చు సూది పురుగుల నివారణ గురించి శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ఏవో పి. జ్యోతి, పూడూర్ మాజీ సర్పంచు వి. రాంరెడ్డి, ఏఈవోలు శ్రీలత, గ్రీష్మ, పలువురు రైతులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి కల్యాణం

భీమారం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, అన్ని కుల సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ మంజూరు చేయాలి

రాయికల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని మైతాపూర్ గ్రామంలో 33/11 కేవీ సబ్ స్టేషన్ మంజూరు చేయాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు మాజీ మంత్రి జీవన్ రెడ్డి మంగళవారం లేఖ పంపించారు. మైతాపూర్, కుమ్మరిపెల్లి ఫీడర్ అత్యధిక లోడ్‌తో కొనసాగుతుందని నూతన సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని కోరారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని సమకూర్చేందుకు స్థానిక రైతులు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రులు నిబంధనలు పాటించకుంటే చర్యలు

-జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్ కుమార్



ప్రైవేట్ ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్

మెట్‌పల్లిటౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆసుపత్రులు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కెప్రమోద్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం మెట్‌పల్లి పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎం, గర్భిణీతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద శాతం కాన్పులు ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగేలా ప్రతి గర్భిణీకి అవగాహన కలిగించాలని సిబ్బందికి సూచించారు. సాధారణ కాన్పుల వల్ల కలిగే ప్రయోజనాల గురించి గర్భిణులకు, తల్లులకు గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణీలకు అందించే సేవల గురించి క్షేత్ర స్థాయిలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు వివరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సూచించారు. అనంతరం గర్భిణులకు పండ్లను పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లను మండల వైద్యాధికారి ఎల్లాల అంజిత్‌రెడ్డితో కలిసి తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పలు ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లకు నోటీసులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సాజిద్, ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, జిల్లా మాతా శిశు అధికారి డాక్టర్ జైపాల్ రెడ్డి, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సమ్యుద్దీన్, గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'రెవెన్యూ సదస్సుల్లో సమస్యల పరిష్కారం'



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

గొల్లపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని, సదస్సుల్లో సమస్యలు పరిష్కారం చేస్తామని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభాతి చట్టం ద్వారా భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆమె పేర్కొన్నారు. మంగళవారం గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకు వచ్చిందని తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు విజయవంతంగా నిర్వహిస్తూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నామని అన్నారు. ఆయా సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ అధికారులు పరిష్కరిస్తున్నారని తెలిపారు. అనంతరం గుంజపడుగు రెవెన్యూ సదస్సులో ప్రజలు నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుని వెంటనే రసీదులు ఇవ్వాలని అధికారులకు ఆమె సూచించారు.

కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల, జూన్10 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని జిల్లా పంచాయతీ కార్యదర్శులు మంగళవారం కలెక్టర్ సత్య ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. గ్రామ పంచాయతీల ఐఎఫ్ఎంఎస్ ట్రెజరీలో పెండింగ్‌లో ఉన్న చెక్కులను వెంటనే క్లియర్ చేయాలని కోరారు. గ్రామ పంచాయతీ సాధారణ నిధులను ట్రెజరీకి అనుసంధానం తొలగించాలన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నాలుగు సంవత్సరాల విధి నిర్వహణ కాలాన్ని సర్వీస్‌గా పరిగణించాలని కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. ఈ కారక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం జేఏసీ నాయకులు సాగి రామకృష్ణారావు, వంశీధర్‌రెడ్డి, సంగెం శ్రీకాంత్, ఎం భూమేశ్వర్, కోరుట్ల రాజు, సిహెచ్ ప్రవీణ్, గూడూరు శ్రీకాంత్, మౌనిక, శ్యామల పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి'



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారి నరేష్

రాయికల్, జూన్10 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మాతా శిశు సంక్షేమ శాఖ, వికలాంగుల, వయోవృద్ధుల శాఖ అధికారి డాక్టర్ భోనగిరి నరేష్ అన్నారు. రాయికల్ మున్సిపల్ పరిధిలో గల 2వ అంగన్‌వాడీ కేంద్రం, మండలంలోని కుమ్మరిపెల్లి అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ నమోదు పెంచాలని, అంగన్‌వాడీ సెంటర్‌లో రెండున్నర సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల పిల్లల వరకు అంగన్‌వాడీలో ఉండాలన్నారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు అంగన్‌వాడీ కేంద్రంలోనే పూర్తవ్వాలన్నారు. ప్రైవేట్ స్కూల్‌కు దీటుగా అంగన్‌వాడీ పని చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో సీడీపీవో మమత, సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, పద్మ, సుమలత, వనిత, పద్మ పాల్గొన్నారు.

నరసింహుడి దయతోనే మంత్రి పదవి

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ● కాంగ్రెస్ నాయకుల ఘన సన్మానం





ధర్మపురిలో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మంత్రిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధర్మపురి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నరసింహుడి దయ వల్లే తనకు మంత్రి పదవి లభించిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంత్రిగా ప్రమాణం చేసి తొలి సారిగా ధర్మపురి నియోజకవర్గానికి వచ్చిన ఆయనకు పట్టణంలోని ఎస్ఎల్ఎన్ గార్డెన్స్‌లో ఆత్మీయ పౌర సన్మాన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్ఠానం గుర్తించి మాదిగ కులానికి ప్రాతి నిధ్యం ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. అనంతరం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సతీమణి కాంతాకుమారి, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, ఏఎంసీ ఛైర్‌పర్సన్ లావణ్య లక్ష్మణ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శైలేందర్‌రెడ్డి, ముస్కు నిశాంత్ రెడ్డి, వేముల సుభాష్, బుర్ర రాములు గౌడ్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్, మైనార్టీ అధ్యక్షులు ఎండి రఫీయుద్దీన్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాజేష్ పాల్గొన్నారు.

మంత్రికి ఘన స్వాగతం

రాయపట్నం రహదారి వద్ద మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ధర్మపురి పట్టణం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. మంత్రి అంబేద్కర్ విగ్రహానికి నివాళు లర్పించారు.

●ఎండపల్లి: మండలంలోని రాజారాంపల్లి వద్ద మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి, పొనుగోటి శ్రీనివాస్‌రావు, శైలెందర్‌రెడ్డి, గుండాటి గోపిక జితెందర్‌రెడ్డి పాల్గొన్నారు.

●వెల్గటూర్: వెల్గటూర్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. అనంతరం మంత్రి అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌రావు, మద్దుల గోపాల్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

●కోరుట్ల రూరల్: మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కోరుట్ల మండల కాంగ్రెస్ నాయకులు ధర్మపురిలో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కొంతం రాజం, ఎస్సీసెల్ అధ్యక్షులు గంగానర్సయ్య పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన కొండగట్టు

7

● అస్తవ్యస్తంగా వాహనాల పార్కింగ్

● ఇబ్బందులు పడుతున్న భక్తులు



కొండగట్టు ఆలయంలో క్యూలైన్‌లో భక్తులు

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.17 వేల జరిమానా, బాధిత బాలికకు రూ.3 లక్షల పరిహారం చెల్లించాలంటూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి మంగళవారం తీర్పునిచ్చారు. రాయికల్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి జైత భీమయ్య(66) అనే వ్యక్తి 2019 సంవత్సరంలో అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై రాయికల్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి డీఎస్పీ వెంకటరమణ, సీఐ రాజేష్, సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు రాజు, కిరణ్ శ్రీధర్‌లు సరైన సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణారావు కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ముద్దాయికి శిక్ష పడడంలో కృషిచేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థినులకు గాయాలు



ప్రమాదానికి గురైన స్కూటీ

పెద్దపల్లి రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్కూటీని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు గాయపడిన సంఘటన పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగింది. మంగళవారం పెద్దపల్లికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థిని ఓమసియా, భోజన్నపేటకు చెందిన విద్యార్థిని అక్షయలు స్కూటీపై ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్తుండగా లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడగా స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదులు రాలేదని పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి రైతు మృతి

మంథనిరూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగారంలో ప్రమాదవశాత్తూ చెరువులో పడి జక్కుల రాజకొమురయ్య (49) మంగళవారం మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. జక్కుల రాజకొమురయ్యకు చెందిన పాడి పశువులు చెరువులో ఉన్నాయి. వాటిని ఒడ్డుకు తీసుకురావటానికి ఆయన చెరువులోకి వెళ్లగా చెరువులోని గుంతలో పడి మృతి చెందాడు. చెరువు ఒడ్డున మృతుడికి సంబంధించిన దుస్తులు, చెప్పులు ఉండటంతో గ్రామానికి చెందిన గట్టయ్య అనే వ్యక్తి చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు చెరువులో గాలించగా మృతదేహం లభించింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

శంకరపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కేశవపట్నం గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ రైతుకు చెందిన పాడి ఆవు మృతి చెందింది. కేశవపట్నం గ్రామానికి చెందిన ఆరెపల్లి తిరుపతికి చెందిన పాడి ఆవు మంగళవారం ఉదయం మార్కెట్ యార్డు పక్కన ఉన్న వాగు వద్ద మేత కోసం కట్టేశాడు. ఆవు మేత మేస్తూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ. 40వేల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు తిరుపతి కోరుతున్నాడు.

పొలం పండుగ



- నేడు ఏరువాక పౌర్ణమి
- వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్న రైతులు

కరీంనగర్ కల్చరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పుడమితల్లి పులకరించే పొలం పండుగ ఏరువాక పౌర్ణమి వచ్చేసింది. రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరియనుంది. శ్రమజీవన సౌందర్యానికి సూచికైన ఈ పౌర్ణమి విశేషాలు వేదకాలం నుంచి నేటి వరకు ఉన్నాయి. ఏటా వ్యవసాయ పనులకు సిద్ధమయ్యే ముందు అన్నదాతలు పండుగ జరుపుకుంటారు. బుధవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా పశువులను, వ్యవసాయ పనిముట్లను పూజించి పొలం దున్నేందుకు సిద్ధమవుతున్నారు. ఏరువాక అంటే భూమిని దున్నడం అని అర్థం. జ్యేష్ఠ మాసం శుక్ల పక్ష పూర్ణిమ నాడు ఏరువాకను జరుపుకోవడం ఆనవాయితీ. నైరుతి ఋతుపవనాల రాకతో వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండాలని పొలం పనులకు ఆటంకాలు కలుగకూడదని రైతులు ఏరువాకను యజ్ఞంగా భావిస్తారు.

ఆధ్యాత్మిక, చారిత్రక నేపథ్యం

ఏరువాక పౌర్ణమికి ఆధ్యాత్మిక, చారిత్రక నేపథ్యం ఉంది. ఏరువాకను జ్యోతిష శాస్త్రవేత్తలు కష్యారంభం, సస్యారంభంగా వ్యవహరిస్తారు. ఔషధులకు పతి అయిన చంద్రుడు నాగలి పనులకు ఉత్తమ నక్షత్రమైన జ్యేష్ఠా నక్షత్రానికి సమీపంలో సంచరించడమే కారణం. రుతువులలో మార్పును సూచిస్తూ ప్రకృతితో మమేకమైన ఈ పండుగ తొలకరి జల్లులతో ప్రారంభమవుతుంది. నాగలి కదిల్చేముందు క్షేత్రపాలకుడిని పూజించేవారని రుగ్వేదంలో ఉంది. బుద్ధుడి తండ్రి శుద్ధోదనుడు ఏరువాక రోజున రైతులకు ఒక బంగారు నాగలిని అందించేవాడని బౌద్ధ రచనలు చెబుతున్నాయి. పాళీ, ప్రాకృత భాషల్లోని కథల్లోనూ ఈ ప్రస్తావన ఉన్నట్లు సమాచారం. జైమినీయ న్యామాలా గ్రంథంలో, హాలుని గాథాసప్తశతిలో ఈ పండుగ ప్రస్తావన కనిపిస్తోంది.

ఇలా ఆచరిస్తారు

ఈ పండుగ పూర్తిగా వ్యవసాయానికి, పనిముట్లకు, పశువులకు సంబంధించిన పండుగ కావడంతో రైతులు వ్యవసాయ సాధనాలను, భూమిని, పశువులను పూజిస్తారు. ఎద్దులను కడిగి వాటి కొమ్ములకు రంగులు వేసి ముస్తాబు చేస్తారు. పశువుల పాకలను, పశువులను కట్టే గాటిని, కాడిని, నాగలిని శుభ్రపరిచి పసుపు, కుంకుమలు, గంధంతో అలంకరిస్తారు. ధూప దీప నైవేద్యాలను సమర్పించి పొంగలిని, భక్ష్యాలను వాటికి ఆహారంగా పెడతారు. మంగళ వాయిద్యాలు, పాటలు, పద్యాలు, కోలాహలం మధ్య సాయంత్రం రైతులు నాగలిని భుజంపై ధరించి ఎద్దులను తోలుకుంటూ వ్యవసాయ క్షేత్రాలకు వెళ్తారు. అక్కడ భూమిపూజ అనంతరం వ్యవసాయ పనులు ప్రారంభిస్తారు. గోగు నారను తాడులా చేసి తోరణం కట్టి దాన్ని చెర్నాకోలతో కొడుతూ వారికి దొరికిన నారను తీసుకొని ఎద్దుల మెడల్లో, నాగలికి కడతారు. ఉత్తర భారతంలో పలు ప్రాంతాలతోపాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో, కర్ణాటకలోనూ ఈ పండుగను వైభవంగా జరుపుకుంటారు.

అన్నపై దాడి కేసులో తమ్ముడికి మూడు సంవత్సరాల జైలు శిక్ష

మెట్‌పల్లిటౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భూ తగాదాలో అన్నపై దాడి చేసిన తమ్ముడికి మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు పది వేల రూపాయల జరిమానా విధిస్తూ మెట్‌పల్లి కోర్టు న్యాయ మూర్తి అరుణ్‌కుమార్ తీర్పు వెలువరించినట్లు పోలీసులు తెలిపారు. మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆత్మకూరు గ్రామానికి చెందిన మల్లయ్యకు ఐదుగురు కుమారులు కాగా ఆత్మకూరు గ్రామ శివారులో ఆయనకు ఒక ఎకరం భూమి ఉంది. ఆ భూమిని ఐదుగురు కొడుకులు సమానంగా పంచుకునే క్రమంలో చిన్న కొడుకు బీరయ్య వినకుండా గొడవలు సృష్టించేవాడని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో బీరయ్యకు సంబంధించిన 8 గుంటల భూమిని వదిలేసి మిగతా భూమిని నలుగురు అన్నదమ్ములు ఒక్కొక్కరు ఒక్కొక్క సంవత్సరం వ్యవసాయం చేసుకుంటున్నారు. అన్నదమ్ములు సాగు చేసుకుంటున్న పంటను బీరయ్య 2019లో తన ట్రాక్టర్‌తో ధ్వంసం చేయడానికి ప్రయత్నించగా అన్న ముత్త య్య అడ్డుగా వెళ్లాడు. దీంతో అన్నను పారతో కొట్టగా అతని కుడి భుజంపై గాయమైంది. దాడి ఘటనపై రెండో తమ్ముడు నడిపి మల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై కిరణ్ కుమార్ నిందితుడు బీరయ్యపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రణయ్ కుమార్ సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి అరుణ్ కుమార్ నిందితుడు బీరయ్యకు మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు 10 వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ట్రైనీ ఎస్సైని సర్వీస్ నుంచి తొలగించాలి



విలేకరులతో మాట్లాడుతున్న సంపత్

హుజూరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండల కేంద్రంలో దళితుడు బత్తుల మహేందర్‌పై దాడి చేసిన ట్రైనీ ఎస్ఐ భార్గవ్‌ను సర్వీస్ నుంచి తొలగించాలని టీపీసీసీ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ రాష్ట్ర ఇన్‌చార్జి టి సంపత్ అన్నారు. మంగళవారం హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత నెల రోజుల క్రితం మహేందర్‌పై పోలీసులు దాడి చేసిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపో వడంతో ట్రైనీ ఎస్సై భార్గవ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారన్నారు. పోలీ సులు ప్రజలను రక్షించడానికి ఉన్నారే తప్ప దౌర్జన్యంగా కొట్టడానికి కాదన్నారు. ట్రైనీ ఎస్ఐ భార్గవ్‌ను సర్వీస్ నుంచి తొలగించకపోతే హైకోర్టుకు వెళ్తామన్నారు. సమావేశంలో ఆర్ రామచంద్రం, టి వసంత్, సీహెచ్ రాహుల్, మహేందర్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న వ్యక్తి రిమాండ్

ఎల్లారెడ్డిపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో పట్టుకుని అదే గ్రామానికి చెందిన వాహన డ్రైవర్ కంకణాల సుధాకర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ రమాకాంత్ మంగళవారం తెలిపారు. గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న క్రమంలో వాహనాన్ని ఆపి తనిఖీలు చేయగా అనుమతి లేదని గుర్తించామని పేర్కొన్నారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్ కంకణాల సుధాకర్‌ను రిమాండ్‌కు తరలించామని చెప్పారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తంగళ్లపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ ఇంట్లో పని చేస్తూ బీపీ ఎక్కువై కింద పడిపోవడంతో తలకు గాయాలు కాగా చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన తంగళ్లపల్లి మండలం చిన్న లింగాపూర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మహిమల రాజవ్వ (51) ఈ నెల 1న ఇంట్లో పనిచేస్తుండగా బీపీ ఎక్కువై కింద పడిపోయింది. దీంతో రాజవ్వకు తలకు గాయం కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా బ్రెయిన్ డెడ్ కావడంతో మంగళవారం మృతి చెందింది. మృతురాలి భర్త రామచంద్రారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న జవాన్‌కు సన్మానం

హుజూరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో మంగళవారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న జవాన్ తిరుపతిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వర్తినేని రవీందర్‌రావు, శ్రీనివాస్, హరిప్రసాద్, మతిన్ తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డుతోనే సంక్షేమ పథకాలను వర్తింపజేయాలి

- భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు చిలువేరు స్వామి



సమావేశంలో మాట్లాడుతున్న చిలువేరు స్వామి

రామగిరి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): లేబర్‌కార్డు పొందిన భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ, ప్రమాద బీమా పథకాలను వెల్ఫేర్ బోర్డుతోనే వర్తింపచేయాలని భవన నిర్మాణ కార్మిక సమైఖ్య సంఘం అధ్యక్షుడు చిలువేరు స్వామి అన్నారు. మంగళవారం కల్వచర్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ భవన, నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా ఈ నెల 4న ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలు దరఖాస్తు చేసుకోవడానికి ఆహ్వానించిందన్నారు. ప్రమాద బీమా రూ.8లక్షలు కాగా శాశ్వత వైకాల్యానికి రూ. 5లక్షలు, పాక్షిక వైకల్యం రూ. 4లక్షలు, సాధారణ మరణం రూ. 2లక్షలు ఇవ్వాలని షెడ్యూల్‌లో పేర్కొన్నారని తెలిపారు. తద్వార సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందె అవకాశం ఉండవని తెలిపారు. ఇన్సూరెన్స్ కంపెనీలు పెట్టే నిబంధనలతో కార్మికులు నష్టపోవాల్సిన పరిస్థితి ఉంటుందని పేర్కొన్నారు. గతంలో మాదిరిగానే సంక్షేమ ఫలాలను కార్మికులకు అందించాల్సిందిగా డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారికి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరునహరి రాజు, ఎస్కే షరీఫ్, భైరిశంకర్, మల్లేష్, శంకర్, రాజయ్య, చంద్రమౌళి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్‌తో రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం



పీఎఫ్ కమిషనర్ ఫసియొద్దిన్‌ను సన్మానిస్తున్న రెవా నాయకులు

జ్యోతినగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రామగుండం ఎన్టీపీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం(రెవా) ఆధ్వర్యంలో మంగళవారం ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ మహమ్మద్ ఫసియొద్దిన్‌తో కరీంనగర్‌లోని పీఎఫ్ కార్యాలయంలో సమావేశమయ్యారు. నిజ వేతన ఆధారిత పెన్షన్(హయ్యర్ పెన్షన్)కు సంబంధించి 230 మంది మాజీ ఉద్యోగులు వారి బకాయి డబ్బుల డీడీలను గతేడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో పీఎఫ్ కార్యాయంలో సమర్పించారని సంఘం నాయకులు గుర్తు చేశారు. 55 మంది విశ్రాంత ఉద్యోగులకు రివైజ్డ్ పీపీవోలు ఈనెలలో జారీ చేస్తామని, జూలైలో మరో 100 మంది రిటైర్డ్ ఉద్యోగులకు జారీచేస్తామని కమిషనర్ తెలిపారు. ఇప్పటి వరకు 10 మంది మాజీ ఉద్యోగులకు రివైజ్డ్ పీపీవోలు జారీ చేసినందుకు పీఎఫ్ కమిషనర్ ఫసియొద్దిన్, ఎపిఎఫ్‌సి వెంకటేశ్వర్లు, అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. రీజినల్ పీఎఫ్ కమిషనర్ ఫసియొద్దిన్‌ను రెవా నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో సంఘం(రెవా) అధ్యక్షుడు ఆకుల రాంకిషన్, ఉపాధ్యక్షుడు మంగళంపల్లి రాంనారాయణ, సంయుక్త కార్యదర్శి చెప్యాల శ్రీపతిరావు, జానకిరాం, తదితరులు పాల్గొన్నారు.

టేకు చెట్లు నరికి దుంగల అపహరణ



తాండ్ర్యాలలో నరికివేసిన టేకు చెట్టు

కథలాపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలంలోని తాండ్ర్యాలలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రైతుల పొలాల్లో ఉన్న టేకు చెట్లను నరికివేసి ఎత్తుకెళ్లారు. తీగల వెంకట్రావు, తీగల సత్యారావు, కాల్వ రాజేశం, కనకట్ల ప్రసాద్ అనే రైతులు తమ పొలాల వద్ద టేకు చెట్లను పెంచుకున్నారు. దుండగులు రాత్రి వేళలో 11 చెట్లను నరికివేసి దుంగ లను ఎత్తుకెళ్లినట్టు బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో దాదాపు 4 లక్షల మేర నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఫోన్ అందజేస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్‌కు చెందిన మేడిద హరీష్ మే 18న సెల్‌ఫోన్ పోగొట్టుకొని రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా మంచిర్యాలలో ఉన్నట్లు గుర్తించి రికవరీ చేశారు. మంగళవారం బాధితుడు హరీష్‌కు రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్ అప్పగించారు.

విద్యుదాఘాతంతో 40 గొర్రెల మృతి



కటికెనపల్లి శివారులో మృతిచెందిన గొర్రెలు

ధర్మారం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ధర్మారం మండలం చామనపల్లి గ్రామానికి చెందిన 40 గొర్రెలు విద్యుత్‌షాక్‌తో మృతి చెందాయి. చామనపల్లి గ్రామానికి చెందిన ఏడుగురు కాపరులు కటికెనపల్లి గ్రామ శివారులో గొర్రెలను మేపేందుకు మంగళవారం మధ్యాహ్నం తీసుకెళ్లారు. నల్లవాగు ప్రాంతంలోని సున్నం మాటు వద్ద గొర్రెలు నీరు తాగుతూ వాగు దాటే క్రమంలో విద్యుత్ స్తంభం ఇన్సులేటర్ విరిగి ఇనుప స్తంభం పట్టిపై పడింది. స్తంభం నుంచి చెట్ల కొమ్మల ద్వారా వాగు నీటికి విద్యుత్ సరఫరా అయ్యింది. దీంతో నీరు తాగుతున్న గొర్రెలు షాక్‌కు గురయ్యాయి. ఈ సంఘటనలో 40 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా 30 గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. సంఘటన స్థలాన్ని ట్రాన్స్‌కో ఏడి విజయ్‌కుమార్, ఏఈ ఎండీ ఖాసీమ్ సందర్శించారు. చనిపోయిన 40 గొర్రెలకు సంస్థ తరుపున 2 లక్షల 80వేలు రూపాయలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అస్వస్థతలో ఉన్న జీవాలు ఎప్పుడు చనిపోతాయో తెలియని పరిస్థితిలో ఉన్నాయని, వాటితో కలిపి 6 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని గొర్రెల కాపరులు డిమాండ్ చేశారు.

నష్ట పరిహారం పూర్తిగా చెల్లించాలి

ప్రమాదవశాత్తు మృతి చెందిన గొర్రెలకు పూర్తి స్థాయిలో నష్ట పరిహారం చెల్లించి తమను ఆదుకోవాలని గొర్రెల కాపరులు డిమాండ్ చేస్తున్నారు. విద్యుదాఘాతంతో చామనపల్లి గ్రామానికి చెందిన దాడి ఐలయ్య, దాడి ఓదెలు, నిట్టు మల్లయ్య, భైర రాయలింగు, నిట్టు ముజ్జయ్య, కొమ్మ లచ్చయ్యలకు చెందిన 40 గొర్రెలు మృతి చెందగా 30 గొర్రెల వరకు అస్వస్థతకు గురై ప్రాణాపాయ స్థితితో ఉన్నాయి. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ట్రాన్స్‌కో అధికారులు మృతి చెందిన 40 గొర్రెలకు ఒక్కోదానికి 7 వేల చొప్పు న మొత్తం 2 లక్షల 80 వేల నష్ట పరిహారం చెల్లిస్తామని చెప్పగా గొర్రెల కాపరులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. తామంతా 6 లక్షల వరకు నష్టపోయామని అస్వస్థతకు గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న గొర్రెలకు కూడా నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని బీజేపీ సీనియర్ నాయకులు కన్న అంజయ్య, జిల్లా గొర్రెల కాపరుల సఘం అధ్యక్షులు వేల్పుల నాగరాజు, గొర్రెల సొసైటీ మండల అధ్యక్షులు జంగ మహేందర్ సందర్శించారు.

ఇసుక లారీ డ్రైవర్ల ధర్నా



కొర్కల్‌లో రోడ్డుపై ధర్నా చేస్తున్న ఇసుక లారీ డ్రైవర్లు

వీణవంక, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్కల్ గ్రామంలోని మానేరు వాగు ఇసుక రీచ్ యాజమాన్యం రోజులు గడుస్తున్నా లోడింగ్ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని లారీ డ్రైవర్లు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. మూడు రోజులు గడుస్తున్నా లారీల్లో ఇసుక లోడింగ్ చేయడం లేదని అన్నారు. ప్రతి రోజు చేయాల్సిన లోడింగ్ చేయకుండా తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి లారీ డ్రైవర్లను సముదాయించి ఆందోళన విరమింపజేశారు. కొర్కల్ ఇసుక రీచ్ నుంచి అక్రమ ఇసుక రవాణా కొనసాగుతోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై ఎన్‌సీసీ కేడెట్లకు శిక్షణ



శిక్షకులకు సర్టిఫికెట్ ప్రదానం అధికారులు

రామడుగు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని, వాటిని నియంత్రించే పద్ధతులను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందని కల్నల్ ఆఫీసర్ ఏకే జయంతి, స్టేషన్ ఫైర్ ఆఫీజర్ రాజు నాయక్ అన్నారు. మండలంలోని వెదిర అల్ఫోర్స్ పాఠశాలలో ఎన్‌సీసీ కేడెట్ల శిక్షణ శిబిరంలో అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ ఆకస్మాత్తుగా జరిగే ప్రమాదాలను నివారించవలసిన అవసరం ఎంతగానో ఉందన్నారు. అగ్నిప్రమాదాలు జరిగినపుడు ఆస్తినష్టం, ప్రాణనష్టం కాకుండా వెంటనే స్పందించాలని అన్నారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఆఫీసర్ వి కృష్ణ, సబ్ మేనేజర్ సాగర్‌సింగ్, కేడెట్లు పాల్గొన్నారు.

భార్య వేధింపులు తాళలేక భర్త ఆత్మహత్య



హరీష్ (ఫైల్)

బోయినపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : భార్య వేధింపులు తాళలేక భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోయినపల్లి మండలం తడగొండ గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ రాజకుమార్ తెలిపిన వివరాల ప్రకారం తడగొండ గ్రామానికి చెందిన కుంటాల హరీష్(36)కు కావేరితో 2014లో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. హరీష్ గత కొద్ది సంవత్సరాలుగా గల్ఫ్‌బాట పట్టాడు. కొద్ది నెలల క్రితం హరీష్ స్వగ్రామానికి రాగా భార్య కావేరి హరీష్‌ను సూటి పోటి మాటలతో వేధించడమే కాకుండా ఆత్మహత్య చేసుకోవాలంటూ ఇబ్బంది పెడుతుండేది. దీంతో భార్య వేధింపులు తట్టుకోలేక హరీష్ గ్రామంలోని వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే తన కుమారుడి మృతికి కోడలు కావేరి కారణమని తల్లి ప్రమీల ఎస్ఐకి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో లారీ దగ్ధం



దగ్ధమవుతున్న లారీ

సుల్తానాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సుగ్లాంపల్లి గోదాముల వద్ద షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన అగ్ని ప్రమాదంలో లారీకి నిప్పంటుకుంది. అయితే సమీపంలో ఉన్న మిగతా లారీ డ్రైవర్లు, హమాలీలు లారీకి అంటుకున్న మంటలను ఆర్పేందుకు సహాయక చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న పెద్దపల్లి అగ్నిమాపక కేంద్రం నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో పెద్దపల్లికి చెందిన లారీ కొంత కాలిపోయింది. వివిధ మిల్లుల నుంచి బియ్యం లోడ్‌లతో వచ్చిన లారీలు అన్‌లోడ్ అయ్యాక పక్కన నిలిపి ఉంచారు. అయితే పైన ఉన్న విద్యుత్ తీగలు గాలిదుమారం వలన ఒకటికొకటి తాకుతూ నిప్పురవ్వలు చెలరేగి లారీకి అంటుకున్నాయని ప్రత్యక్షంగా చూసిన వారు తెలిపారు. లారీ డ్రైవర్లు, హమాలీలు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలతో పెద్ద ప్రమాదం తప్పిపోయింది.

రైతులకు శిక్షణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చొప్పదండి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్లాపూర్, వెదురుగట్ట గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పంటల సాగులో ఎదురవుతున్న సమస్యలను, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సువర్ణ, డాక్టర్ మహేష, ప్రియదర్శిని, మండల వ్యవసాయ అధికారి వంశీ, విస్తరణ అధికారులు సాయి ప్రసన్న, సంపత్ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

చొప్పదండి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండ సురేఖల పేరుతో పలు ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర డీడీఎన్ సంఘం ఉపాధ్యక్షుడు ప్రభాకరాచార్యులు అన్నారు. అర్చక ఉద్యోగులతో పాటు ధూపదీప నైవేద్య అర్చకుల కోసం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంతో రాష్ట్ర ప్రభుత్వం కోసం 41 రోజులపాటు డీడీఎన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదెల మృతి

మల్యాల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేటకు చెందిన మర్రి తిరుపతి గేదెలు రెండు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. మేత కోసం కొండగట్టు సమీపంలోకి వెళ్లగా తెగిపడి ఉన్న విద్యుత్ తీగలు తాకి గేదెలు మృతి చెందాయని తిరుపతి తెలిపాడు. మృతి చెందిన గేదెల విలువ రూ.1.50లక్షల వరకు ఉంటుందని అన్నాడు.

ఇందిరమ్మ ఇళ్లకు గుత్తేదారుల వల



- 400 చదరపు అడుగుల భవనానికి రూ.10 లక్షలు
- 600 చదరపు అడుగులకు రూ.16 లక్షలు
- లబ్ధిదారులతో ఒప్పందాలు
- అప్పు చేస్తున్న పేదలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నీడలేని నిరుపేదలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. పల్లెల్లో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించి అర్హులను ఎంపిక చేసింది. లబ్ధిదారుల జాబితాను ప్రకటించింది. ఈ నెల 8తో శుభ ముహూర్తాలు ముగియడంతో ఎల్లారెడ్డిపేట మండలంలోని లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. అదే అదనుగా భావించిన కొందరు గుత్తేదారులు తాము ఇళ్ల నిర్మాణాలను చేపట్టేందుకు లబ్ధిదారులకు వల విసిరారు. 400 చదరపు అడుగుల భవనానికి రూ.10 లక్షలు చెల్లిస్తే అన్ని పనులు పూర్తి చేయడంతో పాటు రంగులు వేసి గృహ ప్రవేశానికి సిద్ధం చేసి ఇస్తామంటూ ముందుకు వస్తున్నారు. 600 చదరపు అడుగుల భవనానికి రూ.16 లక్షలు చెల్లిస్తే నిర్మిస్తామని పేర్కొంటున్నారు.

ప్రభుత్వ నిబంధనలతో తమకు సంబంధం లేకుండా అంతా తామే చూసుకుంటామని స్పష్టం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల బిల్లు మీరే చూసుకోవాలని తేల్చి చెబుతున్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షలతో పాటు రుణం తీసుకుంటే తమకు ఎలాంటి ఇబ్బందులు ఉండకుండా గుత్తేదారులే చూసుకుంటారని భావిస్తున్న లబ్ధిదారులు ఒప్పంద పత్రాలను రాసుకుంటున్నారు. ముందుగా డబ్బులు చెల్లిస్తున్నారు. ఉన్నంతలో సొంతింటి కల సాకారం చేసుకుందామనుకుంటున్న పేదలకు గుత్తేదారులు అన్ని వసతులతో నిర్మించి ఇస్తామని పేర్కొంటుండడంతో అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు.



ఇందిరమ్మ పథకం.. గుత్తేదారులకు వరం

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గుండారం, రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, రాచర్లతిమ్మాపూర్, వెంకటాపూర్, నారాయణపూర్, బండలింగంపల్లి, దుమాల, తదితర గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదల కోసం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం గుత్తేదారులకు వరంలా మారనుంది.

మండలంలో మొత్తం 643 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆయా గ్రామాల్లో లబ్ధిదారులు సుమారు 200 ఇళ్లకు భూమి పూజ చేశారు. పల్లెల్లో ఇళ్ల నిర్మాణాల సందడి నెలకొనడంతో గుత్తేదారులు వాలారు. తాము 400, 600 చదరపు అడుగుల ఇంటి భవన నిర్మాణంతో పాటు రంగులు, ఇతర పనులు పూర్తి చేసి తాళం చెవులను అందజేస్తామని పేర్కొంటున్నారు. అందుకు తమకు రూ.10 లక్షలు, రూ.16 లక్షలు చెల్లించాలని నిర్ణయించారు. ఇళ్ల నిర్మాణ పనుల్లో ఇబ్బందులు లేకుండా ఉంటాయనే ఆలోచనతో గుత్తేదారులతో లబ్ధిదారులు ఒప్పందం కుదుర్చుకుంటున్నారు.

బిల్లుల చెల్లింపు ఇలా...

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు భూమి పూజ చేసిన నుంచి పనులు పూర్తయ్యే వరకు గృహ నిర్మాణ శాఖ అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతాయి.

- లబ్ధిదారుడు తన స్వంత స్థలంలో 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టాలి.
- ప్రభుత్వం చెల్లించే రూ.5 లక్షల్లో పునాది నిర్మాణం పూర్తయిన తర్వాత రూ.లక్ష లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తారు.
- రెండో విడతలో గోడలు నిర్మించిన తర్వాత రూ.1.25 లక్షలు జమ అవుతాయి.
- స్లాబ్ దశలో ప్రభుత్వం రూ.1.75 లక్షలను జమ చేస్తుంది.
- ఇంటి నిర్మాణం పూర్తయిన అనంతరం లబ్ధిదారులకు రూ.లక్ష ఖాతాలో జమ చేయడంతో మొత్తం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో లబ్ధిదారుడికి సర్కారు అందించే రూ.5లక్షల ఆర్థిక సాయం అందుతుంది.

నిబంధనల మేరకే బిల్లులు : సత్తయ్య, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట



మండలంలోని గ్రామాల్లో నిరుపేదను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎంపిక చేయడంతో పాటు మంజూరు పత్రాలను అందజేశాం. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులను చేపట్టారు. గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలను గుత్తేదారులకు అప్పగిస్తూ ఒప్పంద పత్రాలు రాసిస్తున్నారనే విషయం తమ దృష్టికి రాలేదు. ప్రభుత్వ నిబంధనల మేరకు గృహ నిర్మాణ శాఖ అధికారులు పర్యవేక్షించిన తర్వాత వివిధ దశలో బిల్లుల చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతుంది.

తెలంగాణ క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి

దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రాంతీయ క్రీడా పాఠశాలల్లో 4వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరానికి నాలుగో తరగతిలో అర్హులైన విద్యార్థులకు ఎంపిక ప్రక్రియను నిర్వహించనున్నామని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ ఎంపికలను మూడంచెల పద్ధతిలో ఈ నెల 16 నుంచి 19 వరకు మండల స్థాయిలో, ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 25, 26 తేదీల్లో జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థులకు జూలై 1 నుంచి 5 వరకు రాష్ట్రస్థాయిలో పోటీలను నిర్వహించనున్నట్లు వివరించారు. మూడు క్రీడా పాఠశాలల్లో 60 మంది బాలురు, 60 మంది బాలికలకు ప్రవేశాలు కల్పిస్తారని తెలిపారు. 3వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు 01-09-2016 నుంచి 31-08-2017 మధ్య జన్మించి 8 నుంచి 9 సంవత్సరాల వయస్సు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌లో వివరాలను నమోదు చేసుకోవచ్చని సూచించారు. అలాగే ప్రవేశాలకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు అందుబాటులో ఉంచిన క్యూఆర్ కోడ్

ఎస్‌యూ ఆంగ్ల విభాగంలో డిజిటల్ తరగతులు



డిజిటల్ క్లాస్‌లను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ ఆచార్య సూరేపల్లి సుజాత

గణేశ్‌నగర్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ కళాశాలలో ఆంగ్ల విభాగంలో డిజిటల్ క్లాసు రూమ్‌ల ను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిజిటల్ క్లాస్‌రూమ్‌లు విద్యా సంస్థలకు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అనేక ప్రయోజనాలను, బోధనను, అభ్యాసాలను నేర్చుకోవడానికి సహకారం అందిస్తాయన్నారు. ఆంగ్ల విభాగాధిపతి విజయ ప్రకాష్ మాట్లాడుతూ డిజిటల్ క్లాస్ రూమ్‌ని అందించిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్‌కు, రిజిస్ట్రార్ ఆచార జాస్తి రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

లలితపల్లిలో ఎల్లమ్మ బోనాలు

ఎలిగేడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు అనుబంధ గ్రామమైన లలితపల్లిలో లక్ష్మీపార్వతిదేవి, రేణుక ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం శివపట్నం వేసి బద్దిపోచమ్మ, ఎల్లమ్మ దేవతలకు మహిళలు బోనం ఎత్తుకొని మంగళహారతులతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా తరలివచ్చి బోనాలను దేవతలకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. యాదవ సంఘం అధ్యక్షుడు మండల చిన్న గట్టయ్య, నాయకులు మండల శ్రీశైలం, శంకర్, బావు పోశాలు, రవి, మామిడి రాజయ్య, కనకయ్య, రాములు పాల్గొన్నారు.



ఎల్లమ్మ బోనాలతో మహిళలు

- సుల్తానాబాద్ : మండలంలోని చిన్నకలువలలో మంగళవారం ఎల్లమ్మ బోనాల పండుగను నిర్వహించారు. గ్రామస్థులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

బద్ది పోచమ్మ ఆలయానికి

పోటెత్తిన భక్తులు



శివసత్తుల నృత్యాలతో ఆలయానికి వెళుతున్న భక్తులు



బోనాలతో క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పిల్లాపాపలను, పాడిపంటలను చల్లగా చూడు బద్ది పోచమ్మ తల్లీ.. అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని సోమవారం దర్శించుకున్న భక్తులు మంగళవారం అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. ఉదయాన్నే అమ్మవారికి మట్టిపాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్లతో శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివచ్చారు. భారీగా తరలివచ్చిన భక్తులతో క్యూలైన్‌లు కిక్కిరిసిపోయాయి. అమ్మవారి దర్శనానికి భక్తులు నెత్తిన బోనాలతో సుమారుగా నాలుగు గంటలపాటు నిరీక్షించినట్లు తెలిపారు. ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు ముందుగా అమ్మవారికి పట్నం వేసి నూతన వస్త్రాలు అందజేసి ఒడి బియ్యం సమర్పించారు. అమ్మవారికి నైవేద్యాన్ని అందజేసి కల్లుసాకతో మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లపాపలను, పాడిపంటలను చల్లంగా చూస్తే మళ్లీ వచ్చేయేడుకు తిరిగివచ్చి మొక్కులు చెల్లిస్తామని చెప్పి భక్తులు తిరుగు ప్రయాణమయ్యారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో ఆధ్వర్యంలో ఉద్యోగులు క్యూలైన్‌లు త్వరగా కదిలేలా చర్యలు తీసుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ వీధుల్లో రద్దీ కనిపించింది.

డాక్టర్ భూంరెడ్డి మృతి తీరనిలోటు


- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



భూంరెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కరీంనగర్ అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ భూంరెడ్డి మరణం తీరని లోటని, వైద్య వృత్తితోపాటు సామాజిక సేవకు కృషి చేశారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం కరీంనగర్‌లో నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూంరెడ్డి ఎంఎస్ చదువుతున్న రోజుల్లో ఢిల్లీలోని ఏయిమ్స్‌లో అప్పటి ప్రధానమంత్రి జవహర్ లాల్‌నెహ్రూ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్, పట్టా అందుకున్నట్లు చెప్పారు. ఆ రోజుల్లో అనారోగ్య కారణాలతో జవహర్ లాల్‌నెహ్రూ ఆసుపత్రిలో చేరిన సమయంలో భూంరెడ్డిని స్వయంగా పిలిపించుకొని వైద్య సేవలు పొందడం గర్వించదగ్గ విషయమని గుర్తుచేసుకున్నారు. అంతకుముందు భూంరెడ్డి కుమారుడు సూర్య నారాయణరెడ్డిని, కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. మంత్రితోపాటు సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, చల్మెడ లక్ష్మీనర్సింహారావు పాల్గొన్నారు.

భూంరెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళులు



భూంరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ప్రముఖ వైద్యులు డాక్టర్ భూంరెడ్డి సోమవారం ఆకస్మికంగా మృతి చెందగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం రాత్రి ఆయన ఇంటికి వెళ్లి భూంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ భూంరెడ్డి కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు వైద్యుల అంజన్‌కుమార్, గడ్డం విలాస్‌రెడ్డి, ఎస్‌ఏ మోసిన్, రాచకొండ చక్రాధర్, పొన్నంసత్యం ఉన్నారు.

నివాళులుఅర్పించిన చాడ

- భగత్‌నగర్ : ప్రముఖ వైద్యుడు భూంరెడ్డి పార్థివ దేహం వద్ద సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి మంగళవారం కరీంనగర్‌లో నివాళులు అర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంతాప సభ

రాజబహద్దూర్ వెంకటరామరెడ్డి విజ్ఞాన పరిషత్ (రెడ్డి సంక్షేమ సంఘం) ఆధ్వర్యంలో మంగళవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వి.భూమ్‌రెడ్డి సంతాప సభను నిర్వహించారు. అధ్యక్షుడు నరహరి జగ్గారెడ్డి, కార్యదర్శి బండ గోపాల్‌రెడ్డి, కాసర్ల మధూకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల బస్‌చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం తగ్గించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు శనిగరపు రజినీకాంత్



సిరిసిల్లలో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సిరిసిల్ల రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యార్థుల బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించడంతో పాటు జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటుచేసిన పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు శనిగరపు రజినీకాంత్ డిమాండ్ చేశారు. విద్యార్థుల బస్‌పాస్ చార్జీలను రాష్ట్రం ప్రభుత్వం పెంచడంతో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెంచిన బస్‌పాస్ చార్జీలను తగ్గించాలంటూ నిరసనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు రజినీకాంత్ మాట్లాడుతూ ఇప్పటికే గతంలో పెంచిన బస్‌చార్జీలు, విద్యార్థుల బస్‌పాస్ చార్జీల కారణంగా గ్రామాల్లోని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. మళ్లీ బస్‌పాస్‌లపై 20 శాతం చార్జీలు పెంచి అమలుచేస్తే బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ప్రధానంగా ఉన్నత చదువు కోసం బస్సులను నమ్ముకున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికే చాలా రూట్లల్లో విద్యార్థుల కోసం బస్సులను నడపడం లేదన్నారు. బస్సుల సంఖ్య పెంచి ఉచిత బస్‌సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే పాసుల చార్జీల పెంచాలనే ఆలోచనలను విరమించుకోవాలని లేకుంటే ఆందోళన చేపడుతామన్నారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేని పాఠశాలలు ఉన్నాయని, వాటిని విద్యాశాఖ అధికారులు వెంటనే సీజ్‌చేయాలని అన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాలు, కేజీబీవీలు, సంక్షేమ హాస్టల్‌లకు పక్కా భవనాలను నిర్మించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కల్యాణ్‌కుమార్, జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, జిల్లా బాలికల కన్వీనర్ సంజన, జిల్లా కమిటీ సభ్యులు సాయిభరత్, శివ, నాయకులు జస్వంత్, అఖిల్, అక్షయ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు



ఉత్సవానికి హాజరైన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిప్పకుర్తి, రామచంద్రపురం గ్రామంలో జరుగుతున్న గౌడ కులస్థుల ఆరాధ్య దైవమైన రేణుకా ఎల్లమ్మ బోనాల ఉత్సవాల్లో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్నాలలో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హైమాక్స్ లైట్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటుకం రమేష్



సిరిసిల్లలో టీఆర్‌టీఎఫ్ బడిబాట బైక్‌ర్యాలీ

సిరిసిల్ల రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, పిల్లలందరినీ తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కటుకం రమేష్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సిరిసిల్లలో మంగళవారం తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుర్ర కృష్ణప్రసాద్‌గౌడ్, బోయన్న గారి నారాయణల ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీని పట్టణంలోని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ పాఠశాలల్లో కంప్యూటర్ విద్య, ఏఐ ఆధారిత విద్య, డిజిటల్ విద్య ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మెంబర్‌షిప్ కన్వీన ర్ సుంకిశీల ప్రభాకర్‌రావు, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు మోతీలాల్, టీఆర్‌టీఎఫ్ నాయకులు పోతుగంటి రమేష్, మహేశుని లక్ష్మీనారాయణ, గోలీ రాధాకిషన్, ముత్తయ్యగారి నాగరాజు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన కొండగట్టు



కొండగట్టు ఆలయం వద్ద భక్తులు



అస్తవ్యస్తంగా వాహనాల పార్కింగ్

మల్యాల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. మంగళవారం వేకువ జాము నుంచే వేలాదిగా తరలివచ్చిన వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. గంటల తరబడి క్యూలైన్‌లలో వేచి ఉండి అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. జగిత్యాల జిల్లా జడ్జి రత్నపద్మావతి మంగళవారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో ఆలయానికి వచ్చిన న్యాయాధికారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలుకగా ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పై చిలుక శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అస్తవ్యస్తంగా వాహనాల పార్కింగ్

- భక్తులకు ఇబ్బందులు

కొండగట్టు కొండపై వాహనదారులు అస్తవ్యస్తంగా పార్కింగ్ చేస్తుండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి మంగళ, శనివారాల్లో ఆంజనేయస్వామి దర్శనానికి ఇరవై వేలకు పైగా భక్తులు వందలాది వాహనాల్లో తరలివస్తుంటారు. అయితే సరైన పార్కింగ్ ప్రదేశాలు లేకపోవడంతో కొండపైన, వైజంక్షన్, జేఎన్‌టీయూ మార్గం, ఘాట్‌రోడ్డు మొత్తం వాహనాలతో నిండుతున్నాయి. స్వామి వారి దర్శనానికి ఒక్క రోజు ముందే వాహనాలు పార్కింగ్ చేసి పెట్టడంతో ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇకనైనా అధికారులు ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గంలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసి కొండపైన వాహనాలను నియంత్రించి అసౌకర్యం కలుగకుండా చూడాలని పలువురు భక్తులు కోరుతున్నారు. రద్దీ సమయాల్లో వాహనాలను ఇష్టారీతిలో నిలపడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

జగిత్యాల అర్బన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన గౌడ విద్యార్థులకు మంగళవారం ప్రతిభా పురస్కారాలను అందించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సంలో మరియు పదో తరగతిలో 90 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు పురస్కారాలు అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో పులి మధు సూదన్‌గౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్, డాక్టర్ ప్రసన్న హరికృష్ణ, జిల్లా గోపా అధ్యక్షులు దుర్గపు రవీందర్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జివి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తిని సత్యనారాయణ గౌడ్, జిల్లా కోశాధికారి గుర్రం సత్యనారాయణ గౌడ్, గుడాల రాజేశం, పోన్నం రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

జగిత్యాల క్రైం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని కృష్ణా నగర్‌లో ఉన్న సాయిబాబా ఆలయ 26వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద బ్రాహ్మణుల ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం చండి హవనం నిర్వహించారు. అనంతరం భక్తులు సాయి బాబా విగ్రహానికి అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సతీష్ కుమార్, నిర్వాహకులు నాగుల కిషన్ గౌడ్, మార కైలాసం, రవి చంద్ర, తవుటు రామ చంద్రం, పురుషోత్తం రావు, రాంకిషన్ రావు, రాజన్న, కిషన్, శ్రీనివాస్ గౌడ్, అశోక్, రాజలింగం, గంగాధర్ తదితరులు ఉన్నారు.

మహిళా సంఘాలకు శిక్షణ తరగతులు

జగిత్యాలరూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని ఐకేపీ కార్యాలయంలో గ్రామ మహిళా సంఘాల పదాధికారులకు శిక్షణ తరగతులు మంగళవారం నిర్వహించారు. జిల్లా సెర్ప్ ఏపీడీ చరణ్‌దాసు శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మహిళాసంఘాల సభ్యులకు శిక్షణ ఇచ్చారు. మహిళ సంఘాల ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో జిల్లా, మండల సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

సారంగాపూర్, జూన్, 10 (ఆంధ్రజ్యోతి) :అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేస్తామని ఎంపీడీవో చౌడారపు గంగాధర్ అన్నారు. మంగళవారం సారంగాపూర్ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ళకు సంబందించి క్షేత్ర స్థాయిలో స్థల పరిశీలన చేశారు. ఆయన మాట్లాడుతూ విడతల వారీగా నిధులు మంజూర వుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుర్రాల రాజేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చేకుట శేఖర్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి


వెల్గటూర్‌లో మాట్లాడుతున్న ఎంఈవో ప్రభాకర్

వెల్గటూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఎంఈవో ప్రభాకర్ సూచించారు. మంగళవారం చెగ్యాంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు భోజనం వడ్డించే సమయంలో శుచి శుభ్రత పాటించాలన్నారు. వంట పాత్రలు, వంట సామాగ్రి శుభ్రంగా ఉండేలా జాగ్రత్త వహించాలని అన్నారు. వంట చేసే సమయంలో తలకు క్యాప్, ఏప్రాన్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

●**కోరుట్ల:** పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులకు, మధ్యాహ్న భోజన సహాయకులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మండల విద్యాధికారి గంగుల నరేషం మాట్లాడుతూ ప్రతి పాఠశాల పరిసరాలు,వంట పాత్రలు, తాగునీరు, వంట సామాగ్రి శుభ్రంగా ఉండాలని వేడిగా ఉన్న పౌష్టికార ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని, రోజు వారీ మెను తప్పకుండా పాటించాలని కోరారు. మాధ్యాహ్న భోజన సహాయకులు విధిగా గ్లౌజులు ధరించాలని, చేతులను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి మార్గం రాజేంద్రప్రసాద్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కృష్ణ మోహన్, సి.ఆర్.పి లు పి.గంగాధర్, జ్యోతి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

●**కథలాపూర్:** మరో రెండు రోజుల్లో పాఠశాలలు తెరుచుకోనున్న నేపథ్యంలో విద్యార్థులకు రుచికరమైన భోజనాలు పెట్టాలని ఎంఈఓ లోకిని శ్రీనివాస్ సూచించారు. మండల వనరుల కేంద్రంలో మంగళవారం పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. పాఠశాలలను శుభ్రంగా ఉంచడంతో పాటు ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం వంటలు వండాలని అన్నారు. మోడల్‌స్కూల్, కస్తూర్బాగాంధీ పాఠశాలలో కూడా భోజనం బాగా ఉండేలా చూసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనం బాగుంటే డ్రాపవుట్స్ లేకుండా ఉంటుందని అందువల్ల హెచ్‌ఎంలు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి రూరల్, జూన్, 10 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని మెట్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని మేడిపల్లి, ఆత్మకూర్ గ్రామాల్లో తహసీల్దార్‌తో పాటు డీటీ అబ్దుల్ ఖాదిర్, ఆర్‌ఐలు కాంతయ్య, ఉమేష్‌లు సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో భూ వివాదాలతో చీటికి మాటికి గొడవలకు దారితీయకుండా సానుకూలంగా సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందన్నారు.

●రాయికల్: మండలంలోని కిష్టంపేట, బోర్నపెల్లి గ్రామాల్లో భూ భారతి గ్రామ సభలను నిర్వహించారు. తహసీల్దార్ నాగార్జున ప్రజల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు పద్మయ్య, దేవదాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

●బీర్‌పూర్: తుంగూర్, రేకులపల్లి గ్రామాలలో తహసీల్దార్ సుజాత, డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భూ భారతి గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సభలలో రైతుల ఇచ్చిన దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ ఐ శ్రీనివాస్, రాహుల్, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, తాజా మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

●కొడిమ్యాల:మండలంలోని చెప్యాల గ్రామంలో భూ భారతి గ్రామ సభను రెవెన్యూ అధికారులు నిర్వహించారు. గ్రామ సభలో ప్రజల నుండి 23 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ఎం. కిరణ్‌కుమార్ తెలిపారు. ఆర్‌ఐ కరుణాకర్ పాల్గొన్నారు.

●ఇబ్రహీంపట్నం:భూ సమస్యల పరిష్కారనికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వరప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని వేములకుర్తి, వర్షకొండ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

●పెగడపల్లి: గ్రామాలలో భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని పెగడపల్లి తహసీల్దార్ బి.రవీందర్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని ఎల్లాపూర్, మద్దులపల్లి గ్రామాలలో మంగళవారం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ రవీందర్, నాయబ్ తహసీల్దార్ లాస్యశ్రీ, గిర్దావర్‌లు శ్రీనివాస్, జమున, ఆంజనేయులు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


వార్డు ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్

కోరుట్ల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ సూచించారు. పట్టణ ప్రజలు తడి, పోడి, హానికరమైన చెత్తలను వేర్వేరుగా ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ కోరారు. మంగళవారం పట్టణంలోని పలు వార్డుల్లో తడి చెత్త, పొడి చెత్తపై ప్రజలకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నుంచి పడవేసే తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన చెత్తను వేరు చేసి మున్సిపల్ ఆటోలకు అందించాలని సూచించారు. తడి చెత్తను కంపోస్ట్ సెంటర్‌కు తరలించి ఎరువుగా తయారు చేస్తామన్నారు. పొడి చెత్తను డిఆర్‌సిసి సెంటర్‌కు తరలిస్తామని అన్నారు. హానికరమైన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించడం జరుగుతుందన్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎంసి శ్రీరామ్ గౌడ్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణలో యువత ముందుండాలి

కథలాపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల యువత దేశ రక్షణలో ముందుండి సైన్యంలో చేరాలని జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మల్యాల మారుతి కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొని స్వగ్రామం వచ్చిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో భూషణరావుపేటకు చెందిన ఆర్మీ జవాన్ బెజ్జంకి అభినవ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, కథలాపూర్ మహేశ్, పిడుగ ఆనంద్‌రెడ్డి, కంటె రాజం, నరెడ్ల రవి తదితరులు ఉన్నారు.

తాండ్ర్యాలకు బస్సులు పెంచాలి

కథలాపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాండ్ర్యాలకు అదనంగా రెండు బస్సు ట్రిప్పులు పెంచాలని ఆ గ్రామ మహిళలు కోరుట్ల డిపో మేనేజర్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. గంభీర్‌పూర్, లింగంపేట నుంచి వచ్చే బస్సులన్నీ ప్రయాణీకులతో నిండిపోతున్నందు వల్ల తాండ్ర్యాలలో బస్సులు ఆపడం లేదని పేర్కొన్నారు. తాండ్ర్యాలకు ప్రత్యేకంగా రెండు అదనంగా ట్రిప్పులు నడపాలని కోరారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

మెట్‌పల్లి రూరల్, జూన్, 10 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టామని మండల వైద్యాధికారి డాక్టర్ అంజిత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని జగ్గసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దోమలతో డెంగీ, గున్యా, మలేరియా, బోద కాలు(ఫలేరియా) వ్యాధులు, కలుషిత నీరు కారణంగా డయేరియా, టైఫాయిడ్, ఫ్లూ వ్యాధులు సోకుతాయని పేర్కొన్నారు.

అంగన్‌వాడీల బలోపేతంపై నజర్

(5వ పేజీ తరువాయి)

టీచర్లకు కష్టంగా మా రుతోంది. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం కోసం పలు కార్యక్రమాలు చేపడుతున్నా ఖాళీలను భర్తీ చేస్తేనే లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో సేవలు అందే అవకాశం ఉంది.

కార్యక్రమాల వివరాలు..

- 10వ తేదీన అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, తల్లిదండ్రుల గ్రూప్ సెల్ఫీ, గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు, మహిళా స్వయం సహాయక సంఘాలతో సమావేశం నిర్వహించారు.
- 11న మూడేళ్ల పైబడిన చిన్నారుల నివాసాలను సందర్శించి అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న సేవలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్ల దాటిన పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి ప్రైమరీ స్కూళ్లలో చేర్పిస్తారు.
- 12,13,16వ తేదీల్లో పోషణ కిచెన్ గార్డెన్ పోషకాహార వివరాలను తెలియజేస్తూ స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తారు. చైల్డ్ ఫ్రెండ్లీ వాతావరణం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండేలా చర్యలు తీసుకుంటారు.
- 17వ తేదీన అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిదండ్రులు, గ్రామ పెద్దల సమక్షంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తారు.

చిన్నారులను చేర్పించేలా చర్యలు

-బోనగిరి నరేశ్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి



జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడేళ్లు దాటిన చిన్నారులను చేర్పించేందుకు అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఐదేళ్ల దాటిన చిన్నారులను దగ్గరలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించడం, చిన్నారులకు అందించే పౌష్టికాహారం, పూర్వపు ప్రాథమిక విద్యపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

నువ్వు సాగు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న పొలాస శాస్త్రవేత్త పద్మజ

బీర్‌పూర్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): నువ్వు విస్తీర్ణం పెంచాలని పొలాస శాస్త్రవెత్త డాక్టర్ డి.పద్మజ అన్నారు. మంగళవారం బీర్‌పూర్ మండలంలోని చిత్రవేణిగూడెంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని ప్రాంతీయవ్యవసాయ పరిశోధన స్థానం పొలాస శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అనంతరం డాక్టర్ ఎన్ బలరామ్ మాట్లాడుతూ నూనె గింజల పంటలలో వచ్చే చీడపీడల, యాజమాన్యం మరియు విత్తన శుద్ధి లాంటి పలు అంశాలను గూర్చి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి ప్రదీప్ రెడ్డి, తిరుపతి నాయక్, వ్యవసాయ విస్తీర్ణ అధికారి వినోద్, గ్రామ రైతులు , మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

ధర్మపురి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్, దమ్మన్నపేట గ్రామాల్లో జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోదనా శాస్త్రం , అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్‌తో అనుసంధానమై రైతుల ముందుకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులకు సాగునీటి యాజమాన్యం, పంట మార్పిడి, చెట్లను పెంచడం పర్యావరణాన్ని కాపాడటం మొదలగు అంశాల పైన అవగాహన కల్పించారు. వరి పంటలో నీటి తడులు, పంట ఏ ఏ దశలో ఇస్తే అధిక దిగుబడులు సాదించి నీటిని ఆదా చేయవచ్చు అనే అంశంపైన రైతులకు వివరించారు. పంట మార్పిడి చేయడం వలన చేకూరే లాభాలను, పర్యావరణాన్ని కాలుష్యం కాకుండా చెట్లను పెచడం ద్వారా ఏ విదంగా కాపాడవచ్చు అనే అంశాల పైన అవగాహన కల్పించారు. యూరియా ఎక్కువ వాడటం వలన కలిగే నష్టాల గూర్చి వివరించారు. క్యాక్రమంలో పొలాస అసిస్టెంట్ ప్రొఫెసర్ సత్యనారాయణ, శ్రీకాంత్, సంపత్, శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి రాజ్ కుమార్, ఏఈఓలు పాల్గొన్నారు.

నృసింహుడి సన్నిధిలో మంత్రి అడ్లూరి పూజలు


పూజలు చేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంగళవారం పూజలు నిర్వహించారు. మంత్రి హోదాలో మొదటిసారిగా ఆలయలానికి విచ్చేసిన ఆయనకు ఆలయం వద్ద వేదపండితులు, అర్చకులు సిబ్బంది పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ కలిసి మంత్రికి స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహుకరించి ఘనంగా సత్కరించారు. ఆయన వెంటన మాజీమంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, టిపిసిసి సభ్యుడు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురికి తరలిన కాంగ్రెస్ శ్రేణులు

పెగడపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి మంగళవారం మొదటి సారిగా నియోజకవర్గానికి వచ్చిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు స్వాగతం పలికేందుకు పెగడపల్లి మండల కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెల్లారు. మొదటిసారిగా నియోజకవర్గానికి వచ్చిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను పెగడపల్లి మండల కాంగ్రెస్ నాయకులు ధర్మారం మండలం పత్తిపాక ఎక్స్ రోడ్డు వద్దకు భారీగా తరలివెల్లి గజమాలలు, పూల బోకేలు, ఫ్లెక్సీలతో ఘనంగా స్వాగతం పలికి, మంత్రి వెంట కాన్వాయ్‌లో ధర్మపురికి తరలివెల్లారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు మార్కెట్ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, నాయకులు ఒరుగల శ్రీనివాస్, తాటిపర్తి శోభారాణి, సంధి మల్లారెడ్డి, ఆకుల విష్ణు, కడారి తిరుపతి, పూసాల తిరుపతి, బండారి శ్రీనివాస్, రాజేందర్, అంజయ్య, శ్యాంసుందర్ రెడ్డి తదితరులు తరలివెల్లారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

మెట్‌పల్లిటౌన్,జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లిలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక, రెండవ సిజిఆర్ఎఫ్ నిజామాబాద్ లోకల్ కోర్టును బుధవారం 33/11కేవీ ఉపకేంద్రం ఆవరణలో నిర్వహిస్తున్నట్టు మెట్‌పల్లి ఆపరేషన్ ఏడీఈ దురిశెట్టి మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకల్ కోర్టులో మెట్‌పల్లి ఆపరేషన్ సబ్ డివిజన్ పరిధి మెటుపల్లి రూరల్, మెట్‌పల్లి టౌన్-1, మెట్‌పల్లి టౌన్-2 సెక్షన్ల కు చెందిన వినియోగదారులు తమ విద్యుత్ సంబంధిత ఫిర్యాదులు, సమస్యలు దాఖలు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

జగిత్యాల అర్బన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్ రూం ఇళ్ళలో ఎవరయినా మరణిస్తే అంత్యక్రియలు చేయడానికి స్మశానవాటిక స్థలం కేటాయించి సమస్యను పరిష్కరించాని నూకపెల్లి అర్బన్ కాలనీ వాసులు మంగళవారం ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందించారు. నూకపెల్లి అర్బన్ కాలనీలో డబుల్ బెడ్‌రూం ఇళ్ళతో పాటు దశాబ్దంన్నర కాలంగా ఉంటున్న ఇందిరమ్మ ఇళ్ళ వాసులు ఎమ్మెల్యేకు వినతి ఇవ్వగానే స్పందించిన ఎమ్మెల్యే డబుల్ బెడ్‌రూం కాలనీలో ఎన్ని సమస్యలున్న తనకు తెలియ జేయాలని వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. దాత్రిక నరేందర్, రామగిరి రమేష్, బొల్లారం స్వామి, పద్మ, అజార్ తదితరులు పాల్గొన్నారు.

●జగిత్యాల అర్బన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు ఎలక్ట్రిసిటీ ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీంను వర్తింప చేసే విదంగా చొరవ తీసుకోవాలని వినతి పత్రాన్ని అందజేశారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృషికి తీసుకెళ్ళి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచారు. ఈ సందర్భంగా జేపిసి చైర్మన్ రాజావీరు, రాంజీ, ప్రమోద్, ప్రసాద్, బాలు, అబిద్ ఖాన్, ప్రకాశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన నాయకులు

రాయికల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణ అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.15 కోట్ల నిధులు మంజూరు చేయించినందుకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. వీలైనంత త్వరగా టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. అనంతరం మోర హన్మాండ్లు మాట్లాడుతూ రూ.15 కోట్ల నిధులతో రాయికల్ పట్టణం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ గన్నె రాజరెడ్డి పాల్గొన్నారు.

ట్రాక్టర్ యూనియన్ కార్యవర్గం

బీర్‌పూర్,జూన్ 10(ఆంధ్రజ్యోతి):బీర్‌పూర్ మండలంలోని తాళ్ళధర్మారం గ్రామంలో మంగళవారం ట్రాక్టర్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మారివేని మైసయ్య, ఉపాధ్యక్షులుగా నల్ల మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా భూపతి నర్సింగ్, కోశాధికారిగా నల్ల మహేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తాళ్ళధర్మారం గ్రామానికి చెందిన ట్రాక్టర్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


వెల్గటూర్‌లో మాట్లాడుతున్న సూపర్‌వైజర్

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూపర్‌వైజర్ రాణి అన్నారు. మంగళ వారం నుంచి జిల్లా వ్యాప్తంగా అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమం ప్రారంభం అయ్యింది. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించడమే లక్ష్యంగా గత యేడాది నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమానికి జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. జగిత్యాల పట్టణంలోని స్థానిక గాంధీనగర్‌లో గల అంగన్వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ రాణి తల్లులకు ప్రీ స్కూల్ ప్రాముఖ్యతను వివరించారు. అంతకుముందు సెంటర్‌లో ఉన్న ప్రీ స్కూల్ మెటీరియల్, బుక్స్‌ను డిస్‌ప్లే చేశారు. రెండున్నర సంవత్సరాల్లోపు పిల్లలు స్కూలుకు రావడం వల్ల వారి యొక్క మెదడు ఏ విధంగా వృద్దిచెందుతుందనే అనే అంశంపై పోషకులకు వివరించారు. అనంతరం పిల్లలు, పోషకులు కలిసి సెల్ఫీలు దిగారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ లక్ష్మీ, ఆయా వనిత, పోషకులు పాల్గొన్నారు.

●వెల్గటూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ అంగన్‌వాడీ-2 కేంద్రంలో అంగన్‌వాడీ బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అండాలు మాట్లాడుతూ 3 నుండి 5 సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని కోరారు. ప్రీ స్కూల్ ఆక్టివిటీల గురించి తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మల్లీశ్వరి, సీఏ రాజమణి, మానస, గంగ, రాజేశ్వరి పాల్గొన్నారు.

●కథలాపూర్: కథలాపూర్ మండలంలోని సిరికొండలో సోమవారం అమ్మమాట..అంగన్‌బాట కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలను పూలతో అలంకరించి చిన్నారుల తల్లిదండ్రులను ఆహ్వానిం చారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి చిన్నారులకు పౌష్టికాహారం అందేలా చూడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హమదీబేగం కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య కూడా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, ఏఎల్ఎంఎస్‌సి కమిటీ సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ ముంజ లత, వీఓ అధ్యక్షురాలు గుండేటి లలిత ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి


సిరికొండలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కొడిమ్యాల, జూన్10(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో బడి ఈడు పిల్లలను చేర్పించాలని కోరుతూ మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో బాగంగా మండలంలోని వివిద గ్రామాల్లో ఇంటింటికి వెల్లి ఉపాధ్యాయులు తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం కలిపిస్తున్న సౌకర్యాలను గురించి అవగాహన కలిపిస్తు కరపత్రాలను అందించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామాల ప్రముఖులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

●కథలాపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బడిలో అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం విష్ణు కోరారు. మండలం లోని సిరికొండ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ ప్రచారం చేశారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాం వంటి వసతులు కల్పించనున్నామన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, యువకులు ఉన్నారు.

నియామకం

మల్లాపూర్, జూన్, 10 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ మండల మాల మహార్ సేన కార్యవర్గం ఎన్నికలు మంగళవారం నిర్వహించుకున్నట్లు సభ్యులు తెలిపారు. అధ్యక్షుడిగా పులేరి రాము, ప్రధాన కార్యదర్శిగా బోడ శేఖర్, ఉపాధ్యక్షులుగా ఉడుగుల గంగాధర్, డౌడే గంగా నర్సయ్య, మద్దెల నరేష్, ఈర రాజేందర్, కొంపల్లి రాజు, మ్యాకల మహేష్, కార్యదర్శులుగా డ్యాగల నారాయణ, కోడిపెల్లి రాజేందర్, బక్కూరి చింతా మణి, చింతల శ్రీనివాస్, వీర రవీందర్, ముఖ్య సలహాదారులుగా బిట్ల నరేష్, పాలేపు దిలీప్, జేడీ ముత్యం, బొల్లం రాజు, ఎడ్ల సురేష్, సోషల్ మీడియా ఇంచార్జి తలారి ప్రేమ్‌కుమార్‌లను ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు సన్మానించి అభినందనాలు తెలిపారు.

ఎల్లమ్మ ఆలయంలో పూజలు

మెట్‌పల్లి రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లుల్ల ఆలయానికి మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీతో ఒక్క రోజు ఆలయానికి రూ. 82,887వేలతో పాటు పది గ్రామాలు వెండి అభరణాలు, అమెరికా తొమ్మిది డాలర్స్ వచ్చినట్లు దేవాదాయ శాఖ డిప్యూటేషన్ అధికారి కల్వకుంట్ల అనిల్ రావు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దేవాలయ కార్యనిర్వహణ అధికారి కాంతరెడ్డి నేతృత్వంలో సూచనలతో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధికారులు రేండ్ల గంగాధర్, పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వెల్గటూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం కోరారు. వెల్గటూర్ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి జనార్దన్ అధ్యక్షతన మంగళవారం మండల కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు.